వార్షిక ఫాస్టాగ్ పాస్

ధర: ఏడాదికి రూ.3 వేలు

అందుబాటులోకి: 2025 ఆగస్టు 15

చెల్లుబాటు: ఏడాదిపాటు లేదా 200 ట్రిప్పులు (ఏది ముందు అయితే అది)

కవరేజ్: జాతీయ రహదారులు, జాతీయ ఎక్స్‌ప్రెస్‌వేలు

రూ.3 వేలు.. 200 ట్రిప్పులు!

వార్షిక ఫాస్టాగ్ పాస్ తెస్తున్న కేంద్రం ● ఆగస్టు 15 నుంచి అందుబాటులోకి

ప్రైవేటు వాహనాలకు మాత్రమే జారీ ● వాణిజ్య వాహనాలకు వర్తించబోదు

ఎన్ని టోల్ బూత్‌లు దాటితే అన్ని ట్రిప్పులుగా లెక్క: కేంద్ర మంత్రి గడ్కరీ

న్యూఢిల్లీ, జూన్ 18: జాతీయ రహదారులపై తరచుగా ప్రయాణించే ప్రైవేటు వాహనదారులకు కేంద్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. వచ్చే ఆగస్టు 15 నుంచి రూ.3000 విలువైన వార్షిక ఫాస్టాగ్ పాస్‌ను అందించనున్నట్టు బుధవారం వెల్లడించింది. ఈ పాస్‌పై జాతీయ రహదారుల మీద 200 ట్రిప్పులు లేదా ఏడాది వరకు (ఏది ముందైతే అది) ప్రయాణించవచ్చని పేర్కొంది. ఈ పాస్ వాణిజ్య వాహనాలకు వర్తించదు. కేవలం ప్రైవేటు కార్లు, జీప్‌లు, వ్యాన్‌లకు మాత్రమే జారీ చేస్తారు. ప్రతినిత్యం ఫాస్టాగ్‌లను రీచార్జి చేసుకొనే అవసరం లేకుండా టోల్ చార్జీలు కట్టకుండా జాతీయ రహదారులపై ప్రయాణించవచ్చని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఏడాది లోపే 200 ట్రిప్పులు పూర్తి అయితే వెంటనే మళ్లీ రీచార్జి చేసుకోవచ్చని తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు వంటి క్లోజ్డ్ రహదారులపై ఎగ్జిట్ పాయింట్ వద్ద మాత్రమే టోల్ వసూలు చేస్తున్నారు. ఈ పాస్ ద్వారా కూడా అదే విధంగా ఒక ఎంట్రీ–ఎగ్జిట్‌ను ఒక ట్రిప్‌గా పరిగణించి టోల్ వసూలవుతుందని వివరించారు. ఇక ఓపెన్ టోల్ రోడ్ల మీద ఎన్ని టోల్ బూత్‌లు దాటితే అన్ని ట్రిప్‌లుగా పరిగణిస్తారని పేర్కొన్నారు.

ఒక్క ట్రిప్పుకు రూ.15

వార్షిక పాస్ వల్ల ఒక్కో ట్రిప్‌కు అయ్యే సగటు ఖర్చు రూ.15 మాత్రమేనని గడ్కరీ వివరించారు. ఒక పాస్ గరిష్ఠంగా 200 ట్రిప్‌లకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఉదాహరణకు రెండు నగరాల మధ్య నాలుగు టోల్‌గేట్లు దాటాల్సి వస్తే.. వెళ్లి రావడాన్ని ఎనిమిది ట్రిప్పులుగా పరిగణిస్తారు. ఈ లెక్కన వార్షిక పాస్ తీసుకుంటే ప్రతి టోల్‌గేట్ వద్ద సగటున రూ.15 చెల్లించినట్టవుతుంది అని తెలిపారు. ఇప్పటికే ఫాస్టాగ్ ఉన్నవారు కొత్తగా మరో ఫాస్టాగ్‌ను కొనుగోలు చేయాల్సిన అవసరం లేదని చెప్పారు. ప్రస్తుతమున్న ఫాస్టాగ్‌పైనే వార్షిక పాస్‌ను కొనుగోలు చేయవచ్చని తెలిపారు. ఈ పాస్‌లు జాతీయ రహదారులు (ఎన్‌హెచ్), జాతీయ ఎక్స్‌ప్రెస్‌వే (ఎన్‌ఈ)లపైనే చెల్లుబాటవుతాయని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వాలు లేదా స్థానిక సంస్థలు నిర్వహించే ఎక్స్‌ప్రెస్‌వేస్, రాష్ట్ర రహదారులు తదితర రోడ్లపై ఉండే టోల్ బూత్‌ల వద్ద పాత పద్ధతిలోనే ఫాస్టాగ్ పనిచేస్తుందని పేర్కొన్నారు. వార్షిక పాస్ తీసుకోవడం తప్పనిసరి కాదని, ప్రస్తుతమున్న ఫాస్టాగ్ వ్యవస్థ యథాతథంగా కొనసాగుతుందని వివరించారు. వాణిజ్య వాహన యజమానులు ఈ పాస్ తీసుకొనేందుకు ప్రయత్నిస్తే ఎటువంటి సమాచారం లేకుండానే రద్దు చేస్తామని హెచ్చరించారు.

రోజుకు 200 కోట్లు వసూలు!

గత ఏడాది డిసెంబర్ ఒకటి నాటికి దేశవ్యాప్తంగా 10.1 కోట్ల ఫాస్టాగ్‌లు జారీ అయ్యాయి. వార్షిక పాస్‌ల కొనుగోలు, రెన్యువల్‌ను త్వరలోనే రాజ్‌మార్గ్ యాత్రా యాప్‌తోపాటు ఎన్‌హెచ్‌ఏఐ, రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంచుతామని గడ్కరీ తెలిపారు. జాతీయ రహదారులపై ప్రస్తుతం ఫాస్టాగ్‌ల ద్వారా ప్రతి రోజు సగటున రూ.200 కోట్ల వరకు వసూలవుతున్నది. టోల్ బూత్‌ల ద్వారా వాహనాలలో 53 శాతం ప్రైవేటు కార్లే ఉన్నప్పటికీ వాటిద్వారా కేవలం 21 శాతం ఆదాయం మాత్రమే వస్తున్నది.

ప్రయోజనాలు

- రెగ్యులర్ టోల్ పేమెంట్స్‌తో పోలిస్తే ఖర్చు తగ్గుతుంది.
- తరచూ ఫాస్టాగ్ రీచార్జ్ చేయాల్సిన అవసరం ఉండదు.
- టోల్ ప్లాజాల వద్ద వేచిచూసేసమయం తగ్గుతుంది.

ఎలా అప్లై చేయాలి?

- రాజ్‌మార్గ్ యాప్, ఎన్‌హెచ్‌ఏఐ, రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్ లేదా ఫాస్టాగ్ పోర్టల్‌ను సందర్శించాలి.
- ఫాస్టాగ్ వార్షిక పాస్ ఆప్షన్‌ను ఎంచుకోవాలి
- యూపీఐ లేదా నెట్‌బ్యాంకింగ్ ద్వారా రూ.3 వేలు చెల్లించాలి
- 24 గంటల్లో పాస్ యాక్టివేట్ అవుతుంది.

ఒకసారి పాస్ రీచార్జ్ చేస్తే, మరో ఫాస్టాగ్ అకౌంట్‌కు దాన్ని ట్రాన్స్‌ఫర్ చేయడానికి వీలుండదు.

శుభాన్షు రోదసి యాత్ర మళ్లీ వాయిదా

కాలిఫోర్నియా, జూన్ 18: భారతీయులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న శుభాన్షు శుక్లా రోదసి యాత్ర మళ్లీ వాయిదా పడింది. ఈ నెల 22న ప్రయోగం చేపట్టనున్నట్టు ఇస్రో 'ఎక్స్' వేదికగా బుధవారం వెల్లడించింది. ఈ మిషన్‌ను విజయవంతం చేసేందుకు తీసుకోవాల్సిన అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు ప్రైవేట్ సంస్థ యాక్సియం స్పేస్ తాజాగా వెల్లడించింది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో లీకేజ్‌ల కారణంగా ఇటీవల కొన్ని మరమ్మత్తులు చేపట్టాల్సి వచ్చింది. దీనిపై వివిధ అంశాల్ని ఇస్రో మరోమారు మూల్యాంకనం చేసుకునే విధంగా యాక్సియం–4 మిషన్ ప్రయోగ తేదీని మార్చినట్టు తెలుస్తున్నది. శుభాన్షు శుక్లాతోపాటు మరో ముగ్గురు వ్యోమగాములను ఐఎస్ఎస్‌కి పంపుతున్న 'యాక్సియం–4' మిషన్ లోనూ సాంకేతిక సమస్య తలెత్తిన సంగతి తెలిసిందే. ఈ మిషన్‌ను షెడ్యూల్ ప్రకారం మే 29న చేపట్టాలని భావించగా, పలుమార్లు వాయిదా పడుతూ వస్తున్నది. ఫాల్కన్–9 రాకెట్ బూస్టర్స్‌లో ద్రవ ఆక్సిజన్ లీకేజ్ బయటపడటంతో, రాకెట్ ప్రయోగ తేదీ జూన్ 11కు మారింది.

ఉ.అమెరికా పర్వతంపై చిక్కుకున్న కేరళ పర్వతారోహకుడు

తిరువనంతపురం: ఉత్తర అమెరికాలోని డెనలి పర్వతంపై చిక్కుకున్న పర్వతారోహకుడు షేక్ హసన్ ఖాన్‌ను కాపాడాలని కేరళ నేతలు విదేశాంగ మంత్రిని కోరారు. షేక్ తన శాటిలైట్ ఫోన్ ద్వారా పంపించిన సందేశంలో, తాను, తన బృందం క్యాంప్ 5 వద్ద 17,000 అడుగుల ఎత్తులో తుఫానులో చిక్కుకుపోయామని చెప్పారు. తనను కాపాడాలని, సహాయం చేయాలని కోరారు. తమ వద్ద ఆహారం, నీరు తక్కువగా ఉన్నాయని తెలిపారు. 'ఆపరేషన్ సిందూర్'ను నిర్వహించిన భారత దళాలను అభినందిస్తూ ఓ బ్యానర్‌ను ఎగురవేసేందుకు తాను ఇక్కడికి వచ్చానని తెలిపారు. కేరళ ప్రభుత్వోద్యోగి అయిన షేక్ వివిధ ఖండాల్లోని అనేక పర్వతాలను అధిరోహించారు. 2022లో ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించారు.

అమెరికా చదువులకు బైబై!

ట్రంప్ సర్కారు విధానాలతో పునరాలోచనలో విద్యార్థులు ● చిన్న కారణాలకే వీసాల రద్దు

లక్షలు ఖర్చు పెట్టి రిస్క్ చేసేందుకు తల్లిదండ్రుల జంకు ● ఇతర దేశాల వైపు చూపు

న్యూఢిల్లీ: డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత తీసుకుంటున్న నిర్ణయాలు గందరగోళానికి గురిచేస్తున్నాయి. మరీ ముఖ్యంగా విద్యార్థి వీసాల చుట్టూ అనిశ్చితి నెలకొంది. ఈ నేపథ్యంలో వేలాది మంది భారతీయ విద్యార్థుల కల చెదిరిపోతున్నది. అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే వారే కాకుండా ఇప్పటికే అక్కడి యూనివర్సిటీల్లో ప్రవేశం పొందిన విద్యార్థుల ప్రణాళికలను ఇది దారుణంగా దెబ్బతీసింది. అమెరికా వెళ్లాలనుకునే వారికి ప్రస్తుత పరిస్థితులు కఠినంగా మారాయని గ్రాండింగ్ డాట్ కామ్ వ్యవస్థాపకురాలు మమతా షెకావత్ ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా జైపూర్‌కు చెందిన రాంపాల్ సింగ్ పేరును ప్రస్తావించారు. ఆయన కుమారుడు ఈ ఆగస్టులో అమెరికా వెళ్లబోతున్నాడు. అందుకోసం అవసరమైన ఏర్పాట్లు చేసుకున్నాడు. స్టూడెంట్ లోన్‌కు కూడా దరఖాస్తు చేసుకున్నాడు. అయితే, ఇప్పుడు మారిన పరిస్థితుల్లో ఆయన తన నిర్ణయాన్ని పునః పరిశీలిస్తున్నాడని షెకావత్ పేర్కొన్నారు. అమెరికా విధాన మార్పులతో ప్రతి ఒక్కరి ఆర్థిక స్థిరత్వం, వారి పిల్లల భవిష్యత్తు రెండూ ప్రమాదంలో పడ్డాయని ఆమె చెప్పారు. అస్పష్టమైన, లేదంటే చిన్నచిన్న కారణాలకే విద్యార్థులను బహిష్కరించడం వల్ల ఆ కుటుంబాలపై తీవ్ర ప్రభావం పడుతున్నదని పేర్కొన్నారు.

పునరాలోచనలో తల్లిదండ్రులు

అమెరికాలో విధానపరమైన అస్థిరత కారణంగా తల్లిదండ్రులు ఇప్పుడు అమెరికా విద్యపై పునరాలోచనలో పడ్డారు. ఇదే పరిస్థితి దేశవ్యాప్తంగా ఉంది. 2024లో 3.31 లక్షల మందికి పైగా భారతీయ విద్యార్థులు అమెరికా యూనివర్సిటీలు, కళాశాలల్లో చేరారు. ఒకప్పుడు అమెరికాలో అవకాశాలు సమృద్ధిగా కనిపించినప్పటికీ ఇప్పుడు పరిస్థితులు తిరగబడ్డాయి. చాలామంది అనిశ్చితిని, భవిష్యత్తుపై ఆందోళనను ఎదుర్కొంటున్నారు. మరోవైపు, అమెరికాలో అవకాశం వచ్చినా వెళ్లాలా? వద్దా? అని మరి కొందరు ఆలోచిస్తున్నారు. ఒకవేళ వెళ్లినా ఒక సెమిస్టర్ తర్వాత వెనక్కి పంపితే అప్పుడు పరిస్థితేంటని, ఇప్పటి వరకు పెట్టిన పెట్టుబడి సంగతేంటని చాలా మంది ఆలోచిస్తున్నారు. ఇది విద్యార్థులతోపాటు వారి కుటుంబాలను కూడా ఆందోళనకు గురిచేస్తున్నది. ముస్కాన్ అనే విద్యార్థిని ఇప్పటికే యూఎస్ స్టడీ వీసా సంపాదించింది. అయితే, ఇప్పుడు చిన్న చిన్న విషయాలకే విద్యార్థులను వెనక్కి పంపుతుండటంతో తానక్కడికి వెళ్లినా చదువు పూర్తిచేయగలనా? లేదా? అన్న సందిగ్ధంలో పడిపోయింది. సూరత్‌కు చెందిన వస్త్రవ్యాపారి బ్రిజేష్ పటేల్ (50)ది మరో కథ. ఆయన తన కుమారుడిని అమెరికా వర్సిటీలో చదివించాలని కలలు కన్నారు. అందుకోసం దశాబ్ద కాలంగా డబ్బులు వెనకేసుకొస్తున్నారు. తనన కలలను సాకారం చేసుకునేందుకు భార్య నగలు అమ్మేశారు. బంధువుల నుంచి అప్పు కూడా తీసుకున్నారు. అయితే, ఇప్పుడు వీసా అస్థిరత కారణంగా స్టూడెంట్ వీసాకు దరఖాస్తు చేసుకోకపోవడమే మంచిదని కుమారుడికి సలహా ఇచ్చారు. దరఖాస్తు తిరస్కరణకు గురయ్యే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. ఈ ఏడాది మాస్టర్స్ ప్రోగ్రాం కోసం పటేల్ కుమారుడు (21) రెండు యూఎస్ యూనివర్సిటీల్లో అడ్మిషన్ సంపాదించాడు. కన్సల్టెన్సీ సర్వీసులు, అప్లికేషన్ ప్రాసెస్ వంటి వాటి కోసం పటేల్ ఇప్పటికే రూ. 7 లక్షలు ఖర్చు చేశారు. కాగా, అహ్మదాబాద్‌లో ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ నడుపుతున్న సుభాష్ దేవాత్వల్ మాట్లాడుతూ అమెరికాలో మన విద్యార్థులకు ఇంకా భవిష్యత్తు ఉందా? అంటూ రోజూ లెక్కలేనని ఫోన్లు వస్తున్నట్టు చెప్పారు.

ఇతర దేశాలవైపు చూపు

అమెరికాలో అస్థిర పరిస్థితుల నేపథ్యంలో విద్యార్థులు ఇప్పుడు ఇతర దేశాలను ఎంచుకోవచ్చని రోస్టమ్ ఎడ్యుకేషన్ సహ వ్యవస్థాపకుడు సంజోగ్ ఆనంద్ చెప్పారు. విద్యార్థులు అమెరికా బదులుగా హాంకాంగ్, యూకే, యూరప్, ఆస్ట్రేలియాను ఎంచుకోవచ్చని పేర్కొన్నారు. హాంకాంగ్‌లో స్కాలర్‌షిప్, ఆర్థిక సాయం వంటి అవకాశాలు కూడా లభిస్తాయని చెప్పారు. అమెరికాలో వీసా ఆంక్షలు రోజురోజుకు కఠినంగా మారుతున్న నేపథ్యంలో అమెరికా ప్రభుత్వ విధానాలకు విరుద్ధంగా ఏమీ చేయకుండా ఉండటమే ఉత్తమమని అన్నారు. నేటి తల్లిదండ్రులు ఎప్పుడూ తమ పిల్లలు పెద్ద కలలు కనాలని ప్రోత్సహిస్తున్నారని, కానీ అందుకోసం వారి భద్రతను, మన శ్శాంతిని పణంగా పెట్టకూడదని మమతా షెకావత్ అన్నారు. అయితే, ఈ సమస్యలు తాత్కాలికమేనని, త్వరలోనే అంతా సర్దుకుంటుందని నిపుణులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.

యుద్ధం ఆపింది నేనే!

- **భారత్–పాక్ వార్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పునరుద్ఘాటన**
- **అమెరికా ప్రమేయం లేదని ట్రంప్‌తో మోదీ పేర్కొన్న కాసేపటికే వ్యాఖ్యలు**

కననాస్కిస్ (కెనడా), జూన్ 18: భారత్, పాక్ కాల్పుల విరమణ ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. యుద్ధాన్ని ఆపింది తానేనని పునరుద్ఘాటించారు. ఒప్పందంలో అమెరికా ప్రమేయం లేదని భారత ప్రధాని నరేంద్రమోదీ.. ట్రంప్‌తో పేర్కొన్నట్టు విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ పేర్కొన్న కాసేపటికే ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ట్రంప్‌తో ప్రధాని మోదీ ఫోన్‌లో సంభాషించారు. పాకిస్థాన్ నుంచి వచ్చిన వినతి మేరకు తాము ఆపరేషన్ సిందూర్‌ను నిలిపివేశామే తప్ప అమెరికా మధ్యవర్తిత్వం, లేదా ఆ దేశ వాణిజ్య ఒప్పందం ప్రతిపాదన వల్ల కాదని ట్రంప్‌కు స్పష్టం చేశారు. 35 నిమిషాల పాటు ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడిన ప్రధాని ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన విషయాలను అగ్రరాజ్య అధినేతకు వివరించారు. ఆపరేషన్ సిందూర్ నిర్వహించిన తర్వాత ట్రంప్‌తో మోదీ సంభాషించడం ఇదే మొదటిసారి.

ట్రంప్ మళ్లీ అదే మాట

భారత్–పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని తానే ఆపినట్టు ట్రంప్ పునరుద్ఘాటించారు. మీడియాతో మాట్లాడిన ఆయన 'నేను యుద్ధాన్ని ఆపాను.. నేను పాకిస్థాన్‌ను ప్రేమిస్తున్నాను. మోదీతో నిన్న రాత్రి మాట్లాడాను. భారత్‌తో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోబోతున్నాం. అయితే నేనే పాకిస్థాన్–భారత్ మధ్య యుద్ధాన్ని ఆపాను' అని ట్రంప్ బుధవారం మీడియాతో పేర్కొన్నారు.

మోదీకి ట్రిపుల్ షాక్

డొనాల్డ్ ట్రంప్‌తో మోదీ ఫోన్ సంభాషణను కాంగ్రెస్ పార్టీ 'టిపుల్ షాక్'గా అభివర్ణించింది. ప్రభుత్వం దానిని ఒక రాజనీతి విజయంగా పేర్కొంటున్నప్పటికీ, ప్రభుత్వానికి తిరుగులేని షాకేనని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడికి ఉసిగొల్పేలా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన మునీర్ వైట్‌హౌస్‌లో ట్రంప్‌తో బుధవారం లంచ్ చేస్తున్నారన్నారు. అందుకే ట్రంప్ జీ7 సమావేశాన్ని ఒక రోజు ముందుగానే రద్దు చేసుకున్నారా? ట్రంప్‌తో సంభాషణలో మోదీ ఈ విషయాన్ని ఎత్తారా? అని జైరాం రమేశ్ ప్రశ్నించారు.

తెరుచుకోని ఇండిగో విమానం తలుపులు

- **రాయ్‌పూర్‌లో ఘటన**
- **చిక్కుకున్న ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం బఘేల్**

రాయ్‌పూర్: ఇండిగో విమానం మంగళవారం మధ్యాహ్నం రాయ్‌పూర్ విమానాశ్రయంలో దిగిన తర్వాత దాని తలుపులు తెరుచుకోలేదు. దీంతో ప్రయాణికులు సుమారు 30 నిమిషాలపాటు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. దీనిలో చిక్కుకున్న వారిలో ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం, కాంగ్రెస్ నేత భూపేశ్ బఘేల్, ఎమ్మెల్యే చతురి నంద్, రాయ్‌పూర్ మేయర్ మీనాల్ చౌబే కూడా ఉన్నారు. ఢిల్లీ నుంచి బయల్దేరిన 6ఈ 6312 విమానం రాయ్‌పూర్ విమానాశ్రయంలో మధ్యాహ్నం దిగింది. బఘేల్ మాట్లాడుతూ, గేటు తెరుచుకోవడంలో సాంకేతిక సమస్య వచ్చిందని అన్నారు.

15 రోజుల్లో ఓటర్ కార్డు డెలివరీ

- **సమయాన్ని సగానికి తగ్గిస్తూ కొత్త వ్యవస్థ**
- **ఎన్నికల సంఘం వెల్లడి**

న్యూఢిల్లీ, జూన్ 18: ఓటర్ కార్డులను ఓటర్లకు అందజేయటంలో జరుగుతున్న జాప్యాన్ని సగానికి తగ్గిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) ఒక నూతన వ్యవస్థను తీసుకొచ్చింది. 15 రోజుల్లోగా ఓటర్ కార్డు డెలివరీ అయ్యే విధంగా 'ప్రామాణిక ఆపరేటింగ్ విధానాన్ని' (ఎస్‌వోపీ) రూపొందిస్తున్నట్టు ఈసీ బుధవారం ప్రకటించింది. ఓటర్ల జాబితాలో మార్పులు, కొత్తగా పేరు నమోదు వంటివి ఓటర్ కార్డులో అప్‌డేట్ జరిగిన 15 రోజుల్లోగా ఓటరు గుర్తింపు కార్డును ఓటర్‌కు పంపేందుకు కొత్త విధానాన్ని అనుసరించబోతున్నట్టు ఈసీ తెలిపింది. ప్రస్తుతమున్న ఐటీ మాడ్యూల్‌ను మార్చి, కొత్త ప్లాట్‌ఫామ్ ఏర్పాటుచేశామని వెల్లడించింది. ప్రస్తుత విధానంలో ఎలక్టర్ ఫొటో గుర్తింపు కార్డు (ఎపిక్)ను ఓటర్లకు పంపడానికి నెల రోజులపైన సమయం తీసుకుంటున్నది. కొత్త విధానంలో ఎపిక్ జనరేషన్ నుండి పోస్ట్స్ ఆఫ్ డిపార్ట్‌మెంట్ (డీవోపీ) ద్వారా ఓటర్‌కు కార్డు డెలివరీ అయ్యే వరకు ప్రతి దశ రియల్–టైమ్ ట్రాకింగ్‌ను ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్‌వో) ద్వారా నిర్ధారిస్తామని ఎన్నికల కమిషన్ తెలిపింది. ఓటర్లు ప్రతి దశలో ఎస్సెమ్మెస్ ద్వారా నోటిఫికేషన్‌లు అందుకుంటారని, తద్వారా తమ ఎపిక్ కార్డు స్థితిని వారికి తెలియజేస్తామని ఈసీ వివరించింది.

బ్లాక్ కాఫీతో తగ్గనున్న మరణ ముప్పు!

న్యూఢిల్లీ: రోజూ ఒకటి లేదా రెండు కప్పుల బ్లాక్ కాఫీ తాగటం మరణ ముప్పును 14 శాతం వరకు తగ్గిస్తున్నట్టు తాజా అధ్యయనం ఒకటి వెల్లడించింది. కాఫీలో పాలు, చక్కెర జోడించటం ప్రయోజనాల్ని తగ్గిస్తుందని కూడా అధ్యయనం పేర్కొన్నది. రోజూ కాఫీ తాగటం వల్ల లభిస్తున్న ఆరోగ్య ప్రయోజనాలకు.. బహుశా అందులోని బయోయాక్టివ్ సమ్మేళనాలే కారణమని టఫ్ట్స్ వర్సిటీ (యుఎస్)కి చెందిన ఫాంగ్ ఫాంగ్ జాంగ్ చెప్పారు. 'కాఫీ తీసుకోని వారితో పోల్చితే, తక్కువ స్థాయిలో చక్కెర, సంతృప్త కొవ్వులతో కూడిన బ్లాక్ కాఫీని తీసుకున్న వారిలో మరణ ముప్పు 14 శాతం తగ్గింది. రోజుకు మూడు కప్పుల కన్నా ఎక్కువగా కాఫీ తీసుకోవటంతో అదనపు ప్రయోజనం లేదు' అని పరిశోధకుల్లో ఒకరైన పీహెచ్‌డీ విద్యార్థి బింగ్జీ జో చెప్పారు.

రోజుకు 12 గంటల పనివేళలు!

- **కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదన**
- **వ్యతిరేకిస్తున్న ఐటీ ఉద్యోగుల సంఘం**
- **వ్యక్తిగత జీవిత హక్కుపై దాడి అని ఆగ్రహం**

బెంగళూరు: కర్ణాటకలో కార్మికులు, ఉద్యోగులు రోజుకు 10 గంటలు పని చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ పని వేళలను రోజుకు 12 గంటల వరకు అనుమతించాలని పేర్కొంది. ఈ మేరకు దుకాణాలు, వాణిజ్య సంస్థల చట్టం, 1961ని సవరించాలని ప్రతిపాదించింది. ప్రస్తుతం రాష్ట్రంలో రోజుకు 9 గంటల షిఫ్ట్ అమలులో ఉంది.

కలిసికట్టుగా వ్యతిరేకించాలి

రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనను కర్ణాటక రాష్ట్ర ఐటీ/ఐటీఈఎస్ ఉద్యోగుల సంఘం బుధవారం వ్యతిరేకించింది. పని గంటల పెంపును నిరసిస్తూ శ్రామిక వర్గమంతా కలిసి రావాలని కోరింది. ఈ ప్రతిపాదనకు ఆమోదం లభిస్తే, త్రైమాసిక ఓవర్‌టైమ్ పరిమితి ప్రస్తుత 50 గంటల నుంచి 144 గంటలకు పెరుగుతుందని వార్తా కథనాలు వస్తున్నాయి. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఇటీవలే ఉద్యోగులు, కార్మికులు పని చేసే ఒక షిఫ్ట్ సమయాన్ని రోజుకు 9 గంటల నుంచి 10 గంటలకు పెంచాలని ప్రతిపాదించింది. దీనిపై పెద్ద ఎత్తున వ్యతిరేకత వస్తున్నది.

కేంద్రం సూచనలతోనే...

పని గంటల పరిమితిని పెంచడం గురించి పరిశీలించాలని కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలను కోరిందని, దీనికి అనుగుణంగానే ఈ ప్రతిపాదన చేశామని కర్ణాటక కార్మిక శాఖ తెలిపింది. ఛత్తీస్‌గఢ్, గుజరాత్, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్ కూడా ఇదే విధంగా నిర్ణయాలు తీసుకున్నాయని పేర్కొంది.

ఇక రెండు షిఫ్ట్‌లు, ఉద్యోగుల తొలగింపు

రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలను వ్యతిరేకిస్తున్న రాష్ట్ర ఐటీ/ఐటీఈఎస్ ఉద్యోగుల సంఘం స్పందిస్తూ, ఈ ప్రతిపాదన అమలైతే, కంపెనీలు రోజుకు మూడు షిఫ్ట్‌లకు బదులుగా రెండు షిఫ్ట్‌లను పెడతాయని, మూడింట ఒక వంతు మంది ఉద్యోగులను తొలగిస్తాయని ఆందోళన వ్యక్తం చేసింది. పారిశ్రామిక రంగానికి చెందినవారితో రాష్ట్ర కార్మిక శాఖ బుధవారం సమావేశాన్ని నిర్వహించి, ఈ ప్రతిపాదనల గురించి వివరించిందని చెప్పింది. తమ సంఘం ప్రతినిధులు ఈ సవరణలను పూర్తిగా వ్యతిరేకించారని తెలిపింది. పని గంటల పెంపు అంటే, ఉద్యోగులు, కార్మికుల వ్యక్తిగత జీవిత హక్కుపై దాడి చేయడమేనని పేర్కొంది.

● చైనా డ్రోన్ లైట్ షో గిన్నిస్ రికార్డు

నైరుతి చైనాలోని చోంగ్‌కింగ్‌లో మంగళవారం రాత్రి 11,787 డ్రోన్లతో నిర్వహించిన లైట్ షో ప్రపంచ గిన్నిస్ రికార్డును సృష్టించింది. చోంగ్‌కింగ్ సహజ సౌందర్యం, సంస్కృతి, పట్టణ జీవన శైలి వంటి ఏడు విభాగాల్లో ఈ అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. 'సిటీ ఆఫ్ మౌంటెయిన్స్ అండ్ రివర్స్', 'బ్లూమింగ్ కేమిలియాస్', 'డైనమిక్ మెట్రోపోలిస్' వంటి దృశ్యాలు కనువిందు చేశాయి.

విమానం కూలిన చోట 70 తులాల బంగారం

పోలీసులకు అప్పగించి నిజాయితీని చాటుకున్న రాజేశ్

అహ్మదాబాద్ : ఎయిరిండియా ఏఐ–171 విమానం కూలిపోయిన చోట దొరికిన విలువైన ఆభరణాలు, నగదును భద్రంగా పోలీసులకు అప్పగించిన రాజేశ్ పటేల్ నిజాయితీని అందరూ ప్రశంసిస్తున్నారు. ప్రమాద స్థలానికి సుమారు 300 మీటర్ల దూరంలో ఉన్న ఆయన మరి కొందరితో కలిసి సహాయక చర్యల్లో పాల్గొన్నారు. పొగలు కక్కుతున్న శిథిలాల్లో సుమారు 70 తులాల బంగారు ఆభరణాలు, 8 వెండి వస్తువులు, రూ.50 వేల నగదు, కొన్ని అమెరికన్ డాలర్లు తనకు దొరికాయని, వాటిని సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న పోలీసు అధికారికి అప్పగించానని తెలిపారు. సంఘటన స్థలంలో దొరికిన వస్తువులను మృతుల బంధువులకు అప్పగిస్తామని అధికారులు చెప్పారు.

యూపీఎస్ ఉద్యోగులకు రిటైర్మెంట్, డెత్ గ్రాట్యుటీ బెనిఫిట్స్

- **పాత పింఛను పథకం ప్రకారమే వర్తింపు**
- **కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ వెల్లడి**

న్యూఢిల్లీ : కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ బుధవారం కేంద్ర ప్రభుత్వోద్యోగులకు శుభవార్త చెప్పారు. యూనిఫైడ్ పింఛను పథకం (యూపీఎస్) పరిధిలో ఉన్నవారికి పాత పింఛను పథకం (ఓపీఎస్) ప్రకారం లభించే పదవీ విరమణ, మరణానంతర పరిహార ప్రయోజనాలు లభిస్తాయని తెలిపారు. ప్రభుత్వ సిబ్బంది చేస్తున్న డిమాండ్‌ను పరిష్కరించినట్టు తెలిపారు. దీనివల్ల పదవీ విరమణ అనంతర ప్రయోజనాల్లో సమానత్వం వస్తుందన్నారు. ఈ కొత్త నిబంధన ఆ విషయాన్ని ప్రతిబింబిస్తుందని చెప్పారు. సెంట్రల్ సివిల్ సర్వీసెస్ (పేమెంట్ ఆఫ్ గ్రాట్యుటీ అండర్ నేషనల్ పెన్షన్ సిస్టమ్) రూల్స్, 2021 ప్రకారం లభించే రిటైర్‌మెంట్, డెత్ గ్రాట్యుయిటీలకు యూపీఎస్ పరిధిలోని కేంద్ర ప్రభుత్వోద్యుగులు అర్హులవుతారని వివరించారు. పింఛను, పింఛనుదారుల సంక్షేమ శాఖ (డీఓపీపీడబ్ల్యూ) బుధవారం ఓ ఉత్తర్వును జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వోద్యోగి సర్వీసులో ఉండగా లేదా ఇన్‌వాలిడేషన్ లేదా డిజెబిలిటీ కారణంగా ప్రభుత్వ సర్వీసు నుంచి డిశ్చార్జ్ అయినా, పాత పింఛను పథకం ప్రకారం బెనిఫిట్స్ పొందేందుకు ఆప్షన్సను ఈ ఉత్తర్వులో పేర్కొన్నారు. యూపీఎస్ పరిధిలోని కేంద్ర ప్రభుత్వోద్యోగులకు ఇది వర్తిస్తుంది.

ప్రసాద్ సూరికి సాహిత్య అకాడమీ యువ పురస్కారం

గంగిశెట్టి శివ కుమార్‌కు బాల సాహిత్య పురస్కారం

న్యూఢిల్లీ : సాహిత్య అకాడమీ బుధవారం 2025వ సంవత్సరానికి 23 మందికి యువ పురస్కారాలను, 24 మందికి బాల సాహిత్య పురస్కారాలను ప్రకటించింది. ఈ ఏడాది డోగ్రి భాషలో యువ పురస్కారం లేదు. యువ పురస్కారాలు పొందినవారిలో ప్రసాద్ సూరి (తెలుగు), నేహ రుబాబ్ (ఉర్దూ), అద్వైత్ కొట్టరి (ఇంగ్లిష్), పార్వతి తిర్కే (హిందీ) ఉన్నారు. బాల సాహిత్య పురస్కారాలు పొందినవారిలో గంగిశెట్టి శివ కుమార్ (తెలుగు), ఘజన్‌ఫర్ ఇక్బాల్ (ఉర్దూ) ఉన్నారు.